

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## పొద్దుతిరుగుడు రైతులను ఆదుకోవాలి

**-సిఎంకు లేఖ రాసిన హరీష్‌రావు**

**సిద్ధిపేట, మార్చి 3, ప్రభాతవార్త ప్రతినిధి:** పొద్దుతిరుగుడుపంట కొనుగోలుకేంద్రాలను ఏర్పాటుచేసి రైతులను వెంటనే ఆదుకోవాలని కోరుతూ మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డికి లేఖరాశారు. పొద్దుతిరుగుడు కొనుగోలుకేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కొనుగోలుకేంద్రాలు లేకపోవడంతో రైతులు రూ.7280 అమ్ముకోవాల్సిన పొద్దుతిరుగుడు రూ.5500లకే అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారని లేఖలో పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూనెపంటలకు ఎంతో ప్రోత్సాహం ఇచ్చామని కాంగ్రెస్‌పాలనలో పట్టించుకోవడంలేదన్నారు. ఎన్నికలకోడ్‌తోముడిపెట్టకుండా వెంటనే పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. పొద్దుతిరుగుడుపంట అమ్ముకునేసమయం వచ్చినా ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలుకేంద్రాలు ఏర్పాటుచేయలేదన్నారు. బిఆర్ఎస్‌ప్రభుత్వం హయాంలో నాఫెడ్‌ద్వారా సన్‌ఫ్లవర్ కొనుగోలుచేసి నూనెగింజలకు గిట్టుబాటధర కల్పించామని గుర్తుచేశారు. సన్‌ఫ్లవర్ కొనుగోలుకేంద్రాల ఏర్పాటులో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఏర్పాటుచేసి రైతులకు మద్దతుధరను అందించి ఆదుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

## ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

**గజ్వేల్, మార్చి 2, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం గజ్వేల్‌పట్టణంలో ప్రొప్రైటర్ కేతోజి భావనరమణాచారి ఆధ్వర్యంలో ఉచితవైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ఆకుల నరేష్‌బాబు సుమారు 50మంది రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవ అని, ప్రజలకు సేవ చేయడం జీవితానికి ఎంతో సంతృప్తి ఇస్తుందని అన్నారు. భారతప్రభుత్వం ప్రజలకు అతితక్కువ ధరలకే నాణ్యమైన మందులు అందించాలనే సంకల్పంతో జన ఔషధి కేంద్రాలను ఏర్పాటుచేస్తుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచితవైద్యశిబిరంలో ఉచితంగా మందులు పంపిణీచేసిన జన ఔషధి యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక న్యాయవాది వినోద్‌చారి, ఇన్స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గోపాల్, మిందె వెంకటేష్, విజయ్‌కుమార్, హరీష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతికి స్వాగతంపలికిన జిల్లా కలెక్టర్



ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:**

సంగారెడ్డి సమీపంలోని ఐఐటి హైదరాబాద్లో ఆదివారం జరిగిన కార్యక్రమానికి హాజరైన ఉపరాష్ట్రపతి ధన్కర్‌ను జిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరు స్వాగతంపలికారు. హెలిపాడ్‌వద్ద ఉపరాష్ట్రపతిని కలిసి స్వాగతంపలికారు. స్వాగతం పలికినవారిలో కలెక్టర్‌తోపాటు ఎంపి రఘునందన్‌రావు తదితరులు ఉన్నారు.

## జాతీయ ఉపాధిహామీ పథకం సక్రమంగా నిర్వహించాలి

**-డిఆర్‌డివో బాలరాజ్**





ఉపాధీహామీ పనులపై సామాజికతనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, మార్చి 2, ప్రభాతవార్త:**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గుమ్మడిదల మండలం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం శనివారం 4వ విడత సామాజిక తనిఖీ గుమ్మడిదల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్ హౌస్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీవో అధికారి బాలరాజ్, విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామ గ్రామాన జరిగే ప్రణాళికలను కార్యదర్శులకు ఏ విధంగా నిర్వహించాలో స్పష్టంగా తెలియజేశారు. నిరంతరం మండల కేంద్రానికి నివేదిక సమర్పిస్తుండాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో నిర్వహించబోయే కార్యక్రమాలు ముందుగానే ప్రణాళిక ఏర్పాటు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అధికారులకు, గ్రామ కార్యదర్శులకు జాతీయ ఉపాధి హామీ పథకంపై తగు సూచనలు చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకము కింద గుమ్మడిదల మండలంలో 016-04-2023 నుండి 31-03-2024 వరకు చేయబడిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామాల వారీగా తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీఓ దయాకర్, మేనేజర్, సంగారెడ్డి సోషల్ ఆడిటర్, డీఆర్‌పీఎస్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మతల్లి జాతరకు ఆహ్వానం



చిమ్ముల గోవర్ధన్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఉత్సవకమిటీ సభ్యులు

**గుమ్మడిదల, మార్చి 2, ప్రభాతవార్త:**

జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ కేంద్రంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న కట్ట మైసమ్మ తల్లి జాతర ఉత్సవాలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ అధినేత చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని ముఖ్య అతిథిగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 9న కట్ట మైసమ్మ జాతర, 10, 11వ తేదీల్లో ఎల్లమ్మ జాతర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో గ్రామస్థుల సహకారంతో జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, అమ్మవారి కృప అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. భక్తులందరూ జాతర ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిన్న పాపని కుమార్ గౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు మద్దూరి పెంటేష్, లక్ష్మణ్ రావు, దేవయ్య, నారబోయిన కుమార్, నాగరాజు, నారబోయిన శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండుగలా శివపార్వతుల కళ్యాణం



పార్వతీపరమేశ్వరుల కళ్యాణమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, మార్చి 2, ప్రభాతవార్త:**

పెద్దశంకరంపేటపట్టణశివారులో గురుపాదగుట్ట శివాలయం ఆవరణలో వేదబ్రాహ్మణ,పండితుల మంత్రోచ్ఛరణలతో, మరోవైపు మంగళవాయిద్యాల చప్పుళ్లతో పార్వతీపరమేశ్వరుల కల్యాణం ఆదివారం అంగరంగవైభవంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణమహోత్సవం ఆలయకమిటీ అధ్యక్షులు గుజ్జరి కనకరాజు ఆధ్వర్యంలో కన్నుల పండుగగా నిర్వహించారు. పలువురు గ్రామ పెద్దలు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేకపూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కల్యాణ మండపాన్ని రకరకాలపూలతో, అరటిమట్టలతో అందంగా అలంకరించారు. ఉత్సవవిగ్రహాలకు వేదబ్రాహ్మణంచే కళ్యాణమహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిపాల్గొని స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేకపూజలు. అభిషేకాలు నిర్వహించారు.

**వైభవంగా బండ్ల ఊరేగింపు..**

గురుపాదగుట్ట శివాలయం జాతర ఉత్సవాల్లోభాగంగా ఎడ్లబండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శివాలయంచుట్టూ ఐదుప్రదక్షిణలతో బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపుకు భక్తులు అధికసంఖ్యలో హాజరుకావడంతో దేవాలయ ప్రాంగణం భక్తులతో కిటకటలాడింది. ఈ సందర్భంగా ఎడ్లబండ్లకు వివిధరకాల చీరలతో, రంగురంగుల కాగితాలతో దేవతామూర్తుల క్యాలెండర్లను ఎడ్లబండ్లపై అతికించి అందంగా అలంకరించారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీకి మోక్షం లభించేనా?

**-కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీ జరిగేనా**
**-సగం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు అసంపూర్తిగా నిలిచాయి**
**-స్థానిక కాంగ్రెస్ నాయకులు స్పందించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీచేయాలి**

**నర్సాపూర్, మార్చి 2, ప్రభాతవార్త:**

నర్సాపూర్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి సగం సిద్ధంగా ఉన్నా ఇళ్ల పంపిణీకి ఇప్పుడైనా మోక్షం లభించేనా అని, పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పంపిణీ జరుగుతుందా అని పేర్కొంటూ మిగిలిన అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేయించాలని ఈమేరకు స్థానిక కాంగ్రెస్ అగ్రనాయకులు కృషిచేసి ఇళ్లు లేని అర్హులైన నిరుపేదలకు డబ్లుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీచేయాలని నిరుపేదలు కోరుతున్నారు. డివిజన్‌కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నర్సాపూర్‌నకు 500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యాయి. ఈడబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నర్సాపూర్ వెల్దుర్తి ప్రధాన రోడ్డులోని మార్కెట్ యార్డ్ సమీపంలో మొదటగా 250 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు ప్రారంభించారు. రెండవసారి మార్కెట్‌యార్డుకు అటువైపుగా మరో 250ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈమేరకు మొదటగా ప్రారంభించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చింది. గతంలోనే నిరుపేదలకు పంపిణీ చేస్తామని గత టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించినా పంపిణీ జరగలేదు. పూర్తయిన 250 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీకి నోచుకోక అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. అయితే ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఈకాంగ్రెస్‌ప్రభుత్వం హయాంలోనైనా ఇళ్లు లేని నిరుపేదలకు ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేస్తారేమోనని అర్హులైన లబ్ధిదారులు వేయికళ్లతో ఎదురుచూపులు చూస్తున్నారు. అయినా నర్సాపూర్ కాంగ్రెస్ నాయకులు ఈ డబుల్ బెడ్‌రూమ్‌ల విషయాన్ని అసలు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి. కేవలం వారి పార్టీ ప్రయోజనాల దృష్ట్యా పని చేస్తున్నారే తప్ప ఇళ్లులేని నిరుపేదల కోసం ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని పేదలువాపోయారు. ఈ డబుల్ బెడ్‌రూమ్‌ల ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేయకపోవడం పట్ల ప్రజలు అసహనానికి గురవుతున్నారు. అంతేగాక మిగతా 250డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మార్కెట్‌యార్డ్ అటువైపుగా నిర్మాణాలు చేపట్టగా ఈనిర్మాణపనులు స్లాబులువేసి కొన్ని, గోడల కట్టి కొన్ని అసంపూర్తిగా నిలిచిపోయాయి. అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం అడిగే నాథుడే కరువయ్యారు. నర్సాపూర్ పట్టణంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు జరిగినా వాటిని పంపిణీచేసే ఆలోచన ఏరాజకీయనాయకులకు పట్టడంలేదు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మేము ఎందుకుచేస్తామని అధికార కాంగ్రెస్



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దాదాపు పూర్తయినా పంపిణీకి నోచుకోక అలంకారప్రాయంగా ఉన్న దృశ్యం

నాయకులు అనుకుంటుండగా తాము అధికారంలో లేము మేము ఏవిధంగా ఈడబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తిచేస్తామని బిఆర్ఎస్ నాయకులు అనుకుంటున్నారన్న చర్చలు ప్రజల్లో జరుగుతున్నాయి. నిరుపేదల కోసం అప్పటి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం కోట్ల రూపాయలు వ్యయంచేసి నిరుపయోగంగా పడి ఉండటాన్ని ఇక్కడిప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేయాలని అదేవిదంగా పూర్తయిన ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వం పూర్తయిన 250డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయకపోగా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేస్తారేమోనని ప్రజలు ఎదురుచూపులు చూస్తున్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

**-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



చిన్నశంకరంపేటలో పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**చిన్నశంకరంపేట, మార్చి 2, ప్రభాతవార్త:**

ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి, రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ఆసుపత్రిలోని ప్రయోగశాల, టీకాలు, మందులను ఉంచేగదులను ఆయన పరిశీలించారు. ప్రజలకు మెరుగైనవైద్యం అందించాలని, ఆసుపత్రి, ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే వైద్యసేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌తోపాటు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిగారూ మాసమస్యను పరిష్కరించండి

**-ఎనిమిదేళ్లుగా కుంటలు నిండలేదు..పంటలు పండలేదు..**
**-కట్టలను తవ్వారు వదిలేశారు..అయినా పట్టించుకోరెందుకు..?**



గతంలో తవ్వి వదిలేసిన కుంటకట్టనుచూపుతున్న గ్రామస్థులు

**టేక్మాల్, మార్చి 2, ప్రభాతవార్త:**

టేక్మాల్ మండలపరిధిలోని వెల్పుగొండగ్రామంలోని అబ్బని కుంట,అద్యాలకుంట,చిమాన్‌కుంట నిర్మాణాలు చేసిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో, అధికారుల అలసత్వమో తెలియదుగాని, అప్పటి ఎమ్మెల్యే బాబుమోహన్‌హయాంలో కాంట్రాక్టర్ అవతారంలో కొందరునాయకులు కొంతవరకు పనులుచేసి నాకేం తెలియదని ఎనిమిదేళ్ళగా అలాగే వదిలేశారు. పనులుచేస్తూనే కట్ట, తూము మూయడం మరిచారు. వచ్చిన వర్షంనీళ్లు కాస్తా నిల్వ ఉండకుండా అలాగే వెళ్లిపోతున్నాయి. దీంతో కుంట కింద ఉన్న ఆయాకట్టదారులు ఎన్నిమార్లు విన్నవించినా అధికారులుగాని కాంట్రాక్టర్లుగాని ఎవరూ పట్టించుకోవడంలేదని ఆయాకట్టదారులు ఆవేదన వ్యక్తంచేశారు.

ఎండాకాలంలో చెరువుల్లో పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపు, చెరువుకట్టల బలోపేతం,తూములు,అలుగులను నిర్మించటంవంటి పనులు చేపట్టాల్సి ఉంది. కాగా బాధ్యతలేని అధికారులు పల్లెల్లో సమస్యలు ఉంటే పట్టణాల్లోనమకాంపెట్టి ఎసిగదుల్లోకూర్చొని జీతాలు తీసుకుంటూ మాసమస్యలను పట్టించుకోకుండా నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతాప్రమాణాలు పాటించకుండా నిర్మించిన కట్టడాలు, అసంపూర్తిపనులపై పర్యవేక్షణచేయాల్సిన అధికారులు నిర్లక్ష్యపునీడలో నిద్రిస్తున్నారేమోమరి.వేసవికాలం అసంపూర్తిపనులుచేయరు. వర్షాకాలం వర్షంపడుతుంది ఎలాచేస్తాం అంటూ సంబంధితశాఖాధికారులు కాలంగడుపుతూ వెళుతున్నారు. పనులులేకుండా జీతభత్యాలు తీసుకుంటున్నశాఖ ఇదేనేమో అంటూ మండిపడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న ఆకుంటల మరమ్మతులకోసం మండలసమావేశాల్లోనసైతం మండలసభ్యులు నిలదీసినా అధికారులు పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని చెపొచ్చు.

**ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు...**

కుంటలకింద పంటలు సాగుచేసుకొని జీవనం సాగించేటోళ్లం మేము.. ఆకుంటలను మంచిగా జేస్తామని తవ్విండ్రు..అలాగే వదిలేసిండ్రు. ఆకుంటలలో నీళ్లు ఉండటంలేదు. పంటలు పండటంలేదు, బోర్లు ఉన్నవాళ్లే పంటలు వేసుకుంటున్నారు. మాసమస్యకు పరిష్కరం లేదా..మాబాధలు వినేవారులేరు సారూ.. గత ఎనిమిదేళ్లుగా పనులు మొదలుపెట్టి అర్థంతరంగా పనులుచేసి కట్టనుతవ్వి నిర్లక్ష్యంగా వదిలేశారు. వచ్చిన నీళ్లు వచ్చినట్లు వెళ్లిపోతున్నాయి. దీంతో సమీపంలో బోర్లలో నీటిశాతం తగ్గంతోపాటు, పంటలు పండించుకునే వీలులేదు. కుంటలో నీళ్లలేవు. సమీపంలోని వ్యవసాయబోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోయి పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. నీటి ఆధారపంటలపై ఆధారపడి జీవనసాగించే వాళ్లమని ఈవిషయం గత ఎనిమిదేళ్లుగా నాయకులకు అధికా రులకు చెప్పినా వినిపించుకోవడం లేదన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, సైన్స్ అండ్‌టెక్నాలజీమంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేకచొరవ చూపి మాసమస్యలను పరిష్కరించాలని వెల్పు గొండ గ్రామస్థులు కోరుతున్నారు.

**ఇరిగేషన్ డిఈ వివరణ...**

పైవిషయమై ఇరిగేషన్ డిఈ సుబ్బలక్ష్మిని వివరణ కోరగా ఎనిమిదేళ్లుగా సమస్య ఉన్నది వాస్తవమే, కాని రేపు మాపు అంటూ చివరికి మార్చినెలలో ఆ కుంటల మరమ్మతులు చేస్తామని కాంట్రాక్టర్ చెబుతూ కాలం వెళ్లదీస్తున్నట్లు ఆమె వివరణ ఇచ్చారు. వేరే కాంట్రాక్టర్‌తో చేయిద్దామంటే ఆకాంట్రాక్టర్ ఒప్పుకోవడం లేదన్నారు. లేకపోతే లైసెన్స్ రద్దుచేయడంతో పాటు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడం జరుగుతుందన్నారు. ఇందుకు జిల్లాస్థాయి అధికారులు ఒప్పుకోవడంలేదన్నారు. ఎలాగైనా చేయిద్దాంలెండి అంటూ సర్దిచెబుతూ వివరణ ఇచ్చారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల భవితవ్యం నేడే

**-ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సిట్టింగ్ స్థానం తిరిగి సిద్ధిపేటవాసికి దక్కేనా..?**

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ టీచర్స్,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నేడు తెలియనుండడంతో అభ్యర్థుల గుండెల్లో రైల్లు పరగెడుతున్నాయి. జిల్లాలోని పట్టభద్రులు, టీచర్స్ ఓటర్లు ఎటువైపు మొగ్గ చూపారన్నది అంతు చిక్కడంలేదు. పట్టభద్రుల ఎమ్మెల్సీస్థానానికి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి(కాంగ్రెస్), అంజిరెడ్డి(బిజెపి), ప్రసన్నహరికృష్ణ(బిఎస్‌పి)తోపాటు మరో 53మంది బరిలో నిలిచినవిషయం తెలిసిందే!. బిఆర్ఎస్‌పార్టీ ఈసారి అభ్యర్థిని బరిలో నిలపలేదు. 56మంది బరిలో నిలిచినప్పటికి పోటీ మాత్రం ఈముగ్గురుమధ్యనేసాగిందని రాజకీయపరిశీలకులు భావిస్తున్నారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని బరిలో నిలపకపోవడంతో ఆపార్టీ పట్టభద్రుల సానుభూతి ఓట్లు ఎవరికిపడ్డాయో అంతుచిక్కడంలేదు. ఓదశలో బిఆర్ఎస్ పట్టభద్రుల సానుభూతి ఓటర్లు బిఎస్‌పి అభ్యర్థి ప్రసన్నహరికృష్ణవైపు మొగ్గ చూపినట్లు చర్చ జోరుగా జరుగుతుంది. జిల్లాలో పట్టభద్రులు 32589మంది ఓటర్లు ఉండగా 23736మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. టీచర్స్ ఓటర్లు 3212మంది ఉండగా 3046మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇదిలా ఉండగా గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిద్ధిపేటకు చెందిన కూర రఘోత్తంరెడ్డిని పిఆర్‌టియు టీచర్స్ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన విజయంసాధించారు. ఈక్రమంలో ఈసారి ఎన్నికల్లోన ఆయనకు కాకుండా పిఆర్‌టియు ఇదే సిద్ధిపేటకుచెందిన ఒక ఆర్థికసంపన్నుడు మహేందర్‌రెడ్డిని బరిలోకి దించిన విషయం తెలిసిందే! దీంతో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తిరిగి టీచర్స్ ఎమ్మెల్సీగా స్వంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. సిట్టింగ్ ఎమ్మెల్సీస్థానాన్ని పిఆర్‌టియు తిరిగి నిలబెట్టుకుంటుందా చేజార్చుకుంటుందా అన్న చర్చ జోరుగా సాగుతుంది. పిఆర్‌టియు రెబల్ అభ్యర్థిగా రఘోత్తంరెడ్డి తిరిగి రంగంలోకిదిగడంతో చాలావరకు క్రాస్‌ఓటింగ్ జరిగినట్లు సమాచారం. సిద్ధిపేటవాసికి టీచర్లు పట్టంకట్టారా లేదా కొద్దిగంటల్లోనే తేలనుంది. ఇదిలా ఉండగా బిజెపినుంచి టీచర్స్ అభ్యర్థిగా బరిలోకిదిగిన మలక కొమరయ్య సైతం తనగెలుపుకోసం సర్వశక్తులు ఒడ్డి ప్రచారం నిర్వహించారు. అలాగే టిపిటిఎఫ్,యుటిఎఫ్ అభ్యర్థిగా బరిలోకిదిగిన అశోక్‌కుమార్ సైతం తానేమి తక్కువకాదన్న రీతిలో పోటీపడినట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తుంది. ఏది ఏమైనా టీచర్స్ ఎమ్మెల్సీలో బిజెపి అభ్యర్థి మలక కొమురయ్య, పిఆర్‌టియు అభ్యర్థి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మధ్యనే సాగినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తం మీద జిల్లాలో ఓటర్లు ఎటువైపు మొగ్గ చూపారన్నది తేలిపోనుంది.

## నేత్రపర్వంగా ఉమామహేశ్వర కళ్యాణోత్సవం

**-పాల్గొన్న ఎంపి శెట్కార్, మాజీమంత్రి చంద్రశేఖర్**



కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎంపి శెట్కార్, మాజీమంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:**

పట్టణంలోకి రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమామహేశ్వరస్వామి కళ్యాణోత్సవ అంగరంగవైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవ కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్, మాజీమంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్‌లు హాజరై కళ్యాణోత్సవాన్ని కనులారా వీక్షించారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆర్యవైశ్య భవనాన్ని ఎంపి, మాజీ మంత్రి ప్రారంభించారు. ఎంపీకి,మాజీమంత్రికి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు బెజుగం రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి నామ రవికిరణ్‌లు జ్ఞాపికలను అందచేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిజిఐడిసి మాజీ చైర్మన్ మహ్మద తన్వీర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కండెం నర్సింలు, నాయకులు శుక్లవర్ధన్‌రెడ్డి, అశోక్‌రావుగుప్త ఆర్య వైశ్యసంఘం కోశాధికారి అల్లాడి కృష్ణ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

## కోళ్లఫారంలో ఒకేరోజు 1000కోళ్లు మృతి

**-బర్డ్‌ఫ్లూ అని అనుమానం..**

**కొల్చారం, మార్చి 2, ప్రభాతవార్త:**

మెదక్‌జిల్లా కొల్చారంమండలం నాయిని జలాల్‌పూర్ గ్రామంలోని ఓకోళ్ల ఫారంలో 1000కోళ్లు మృతిచెందాయి. గంటలవ్యవధిలోనే 1000కోళ్లు మృతిచెందడంతో సుమారుగా రెండులక్షల రూపాయల వరకు నష్టపోయామని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థికసహాయం అందించి తగినచర్యలు చేపట్టాలని పౌల్ట్రీఫామ్ యజమాని సతీష్‌గౌడ్ కోరారు. పశుసంవర్థకశాఖ అధికారులు, కోడిపిల్లలను పంపిణీచేసిన సూపర్వైజర్‌లు ఎవరూకూడా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎండతీవ్రతకుమాత్రం కోళ్లు చనిపోవడం లేదని, బర్డ్‌ఫ్లూ వచ్చిందేమో అని భయభ్రాంతులకు గురవుతున్నామని కోళ్ల ఫారం యజమాని తెలిపారు.


ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

## పాపిరెడ్డినగర్‌కాలనీలో ఉచిత వైద్య శిబిరం

**శేరిలింగంపల్లి, మార్చి 2 ప్రభాతవార్త :** పేదలకు వైద్యసదుపాయాలను అందించేందుకు స్వచ్ఛందంగా ఉచిత వైద్యసేవలను అందించటం అభినందనీయమని శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి నల్లగండ్లలోని సిటిజన్ స్పెషాలిటి ఆసుపత్రి,జేసీఐ సికింద్రాబాద్ వాకర్ ్స టౌన్,జేసీఐ ఇండియా రైజ్ అప్ 2025 వారి ఆధ్వర్యంలో పాపిరెడ్డినగర్‌కాలనీలోని జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ రాగం నాగేంర్‌యాదవ్,జేసిఐ ఇండియా నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సుమిత్ గోయల్,జేసిఐ ఇండియా జోన్ 12 ప్రెసిడెంట్ చతుర్వేది సంయుక్తంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేసీఐ ఇండియా జోన్ 12 రీజియన్ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్,హెచ్‌జీఎఫ్ ప్రెసిడెంట్ సుమతి,శెక్రటరీ క్రాంతి,స్థానిక సీనియర్ నాయకులు బద్దం కొండల్‌రెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు రాగం అభిషేక్ యాదవ్,వార్డు సభ్యురాలు శ్రీకళ వెంకటేశ్వర్లు, కుమారి, లక్ష్మీ, జయ,అరుణశ్రీ,సాయి,రవి,స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మంద కృష్ణమాదిగను కలిసిన సురేందర్


మంద కృష్ణమాదిగను కలిసిన భెల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

**శేరిలింగంపల్లి, మార్చి 2 ప్రభాతవార్త :** మాదిగ హక్కుల పరిరక్షణకు, భెల్ మాదిగ ఉద్యోగుల సంక్షేమానికి ఎలాంటి పోరాటాలకైనా సిద్దమని తెలంగాణ ఎస్సీవెల్ఫేర్ అసోసియేషన్ భెల్ అధ్యక్షుడు సురేందర్ స్పష్టం చేశారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు మందకృష్ణమాదిగకు పద్మశ్రీ వచ్చిన సందర్భంగా తెలంగాణ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ భెల్ అధ్యక్షులు సురేందర్, తెలంగాణ రాష్ట్ర మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షులు దేవేందర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిహెచ్‌ఈఎల్‌లో మాదిగ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎదుర్కొంటున్న సమస్యలను మందకృష్ణ మాదిగకు వివరించారు. యూనిట్ లో ఎదుర్కొంటున్న కొన్ని కీలకమైన సమస్యలను తెలంగాణ ఎస్సీవెల్ఫేర్ అసోసియేషన్ భెల్ అధ్యక్షులు సురేందర్ వివరించారు. ఏలాంటి సమస్యలున్న తాను అండగా ఉంటానని కృష్ణమాదిగ హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు.

## కాలనీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి : రాజయ్య


హుడా ఫేజ్ 2 రెసిడెన్షియల్ సొసైటీ కార్యవర్గాన్ని సత్కరిస్తున్న దృశ్యం

**శేరిలింగంపల్లి, మార్చి 2 ప్రభాతవార్త:** కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు అందరి భాగస్వామ్యంతో శక్తివంచనలేకుండా కృషిచేస్తానని హుడా ఫేజ్-2 రెసిడెన్షియల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు జి.రాజయ్య అన్నారు. హుడా ఫేజ్-2 రెసిడెన్షియల్ వెల్ఫేర్‌సొసైటీ ఎన్నికలను స్థానిక కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా కే.రామకృష్ణ, ఆర్కిటెక్ ఇంజనీర్ ఎస్. రాజశేఖర్ వ్యవహరించారు. హుడా ఫేజ్-2 రెసిడెన్షియల్ వెల్ఫేర్‌సొసైటీ నూతనఅధ్యక్షుడిగా జి.రాజయ్య, ఉపాధ్యక్షుడిగా ఆర్.రమణా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.సిద్దిరాములు, కోశాధికారిగా రామరాజులను కాలనీ సభ్యుల మధ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జైరాంరెడ్డి, విద్యాసాగర్,భూలోకరావు, వీరారెడ్డి, ఏ.పకీరయ్యలను నియమించారు. ఈ సందర్భంగా కాలనీ సభ్యులు, సీనియర్ నాయకులు ఉరిటి వెంకట్రావు హజరై పాత,కొత్త కమిటీల సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు జి.రాజయ్య మాట్లాడుతూ.. హుడా కాలనీ ఫేజ్2లో కొన్ని సమస్యలున్నాయని, వాటిని స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు : శ్రీనివాస్


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా బాలల రక్షణ అధికారి శ్రీనివాస్

**చార్మినార్, మార్చి 2 ప్రభాతవార్త :** బాలికలు పట్టుదలతో చదివితే అన్నిరంగాలలోను ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని హైదరాబాద్ జిల్లా బాలల రక్షణ అధికారి శ్రీనివాస్ అన్నారు.పాతబస్తీ దూద్‌బౌలి ఆశ్రిత్ హోంలో ఆదివారం జరిగిన సిబిసిపి అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలు బస్తీలకు చెందిన పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, బాలికలు ధైర్యం, పట్టుదలతో చదువుకోవాలని, తల్లిదండ్రులు పిల్లల చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని తెలిపారు. ఆశ్రిత రెయిన్ బో హోమ్ ఆశ్రమం డైరెక్టర్ నాగరాజ్ మాట్లాడుతూ పేద బాలికలకు విద్యతో పాటు ఉచిత వసతిని అందిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఐసిలు విజయ్‌భాస్కర్, రాంరెడ్డి,ఆశ్రిత్ రెయిన్‌బో ఆశ్రమం డైరెక్టర్ నాగరాజు, ప్రోగ్రాం మేనేజర్ వి.పర్వతాలు,ఆశ్రిత రెయిన్ బో హోం ప్రతినిధులు అనిత, లక్ష్మీ పాల్గొన్నారు.

## సామాజిక సేవల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సాల్మన్ రాజ్

**చిక్కడపల్లి, మార్చి 2 ప్రభాతవార్త:** సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సాల్మన్‌రాజ్ అన్నారు. ఆదివారం క్రిస్టియన్ జేఏసీ సెక్రెటరీ పద్మాకర్ నాయుడు అభినంద సత్కార సభ జరిగింది.ఈ సందర్భంగా పద్మాకర్ నాయుడు సహకారంతో ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన అండదాన కార్యక్రమాన్ని సాల్మన్ రాజు ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ జేఏసీ సభ్యులు దీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తమ జేఏసీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనే ధ్యేయం

### ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, మార్చి 2 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని శేరిలింగంపల్లి ఎమె ల్యే, పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్‌లో భాగంగా ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ రాష్ట్ర సమగ్ర శిక్ష అభి యాన్ నిధులుతో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యాభివృద్ధికోసం ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు. రాష్ట్రవాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో భాగంగానే విద్యార్థులకు ఉపయోగకరమైన,అవసరమైన అదనపు తరగతి గదులను త్వరగా నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వారు తెలిపారు. విద్యార్థులు చరవాణిలు, టీవీలకు దూరంగా,


లింగంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

విద్యకు దగ్గరగా ఉండాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్యంతో కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ ఈఈ రాం కుమార్, డీఈ ఖలీముద్దీన్, ఏఈ శ్యాంప్రసాద్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బల్వంత్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాజుయాదవ్, గౌరవ అధ్యక్షుడు వీరేశంగౌడ్, నాయకులు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజ్‌ముదిరాజ్, వార్డు సభ్యురాలు శ్రీకళ, రాజ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, పాండుముదిరాజ్, రవీందర్, సయ్యద్ నయిమ్, ఉపాధ్యాయులు కరుణ, వీరేశం, ఆంజనేయులు, పద్మావతి, విజయ, పద్మకుమారి, సూర్యప్రభ, శ్రీనివాసులు, కిశోర్, సుజాత, పద్మావతి, విద్యార్థులు, స్థానిక కార్యకర్తలు గణేశ్‌ముదిరాజ్, మల్లేశ్, నటరాజ్, మహేందర్‌సింగ్, సలీం, కుమారి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతతత, ఆనందాన్నిచ్చేవి కళలే

### తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్పర్సన్ గుమ్మడి వెన్నెల

**చిక్కడపల్లి, మార్చి 2 ప్రభాతవార్త:** ఆత్మవిశ్వాసం పోటీతత్వాన్ని పెంపొందించుకుని లక్ష్యం వైపు అడుగులు వేయాలని తెలంగాణ సాంస్కృతిక సారధి ఛైర్పర్సన్ గుమ్మడి వెన్నెల అన్నారు.ఆదివారం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో ప్రముఖ రచయిత్రి, పాత్రికేయురాలు డాక్టర్ వనిత ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యలతో మూడు నెలలుగా నిర్వహించిన జానపద గేయ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ వెన్నెల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డాక్టర్ రియాజ్, నగర గ్రంథాలయం ఛైర్మన్ ఉపేందర్‌రెడ్డితో కలిసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఆసక్తిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ప్రశాంతతను, ఆనందాన్ని ఇచ్చేవి కళలు మాత్రమేనని, చిన్నారులు తమ అద్భుతమైన జానపద గేయాల ద్వారా సమాజహితానికి చైతన్యానిఎనిక నిదర్శనమన్నారు. బాలబాలికలందరికి సృజన్మాత్మకశక్తిని, జానపద గేయాల ద్వారా పోటీలు ద్వారా ప్రోత్సహిస్తున్న డాక్టర్ వనితను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ మానవులకు మానసిక ప్రశాంతాన్ని ఆనందాన్ని ఆనందాన్ని ఇచ్చేది జానపద గేయాలు మాత్రమే అని పేర్కొన్నారు. అనునిత్యం సమస్యల వలయంలో చిక్కుక్కున్న మానవులకు మానసిక ప్రశాంతతను, ఆనందాన్ని ఇచ్చేవి జానపద గేయాల ద్వార మాత్రమేనని అన్నారు. ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అన్నారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా పోటీలు నిర్వహించి చిన్నారి బాలికల్లో ద్విగుణీకృతమైన శక్తిని వెలికితీసేందుకు కృషి చేస్తున్న డాక్టర్ వనితను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ తల్లితండ్రులు తమ అభిరుచుల మేరకు పిల్లల భవిష్యత్తును రూపొందించే ప్రయత్నం చేయడం కంటే వారికి ఏరంగంలో అభిరుచి, ఆసక్తి ఉంటుందో మేరకు వారిని ప్రోత్సహిస్తే మంచిదనానరు. ప్రసిద్ద పాత్రికేయురాలు డాక్టర్ వనిత మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో రోజురోజుకు యాంత్రికమైన సంబంధాలు పెరిగిపోతూ మానవ సంబంధాలు క్షీణిస్తున్న దుస్థితిలో ప్రజల మధ్య సంబంధాలు పెంపొందించడమే తమ బాధ్యత అని అన్నారు. అంతరించిపోతున్న తెలుగు పల్లెపాటలు, పండుగ పాటలు, వృత్తిపాటలు, కర్షక గేయాలు, పోలీ పాటలు, పెండ్లిపాటలు, శ్రామిక గేయాలు, ఆటల పాటలు, హాస్యపు పాటలు, లాలిపాటలు, నాట్లు పాటలు, ఏరువాక పాటలు, దంపుళ్ళ పాటలు, ఉడుపుల పాటలువంటి పాటలెన్నో ఉన్నాయన్నారు.ఇవి మన సంపద అని, వాటిని కాపాడుకోవలనే సంకల్పంతో చిన్నారులకు, యువతీ యువకులకు జానపద గేయాల పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హంస హోమియో మెడికల్ కళాశాలకు చెందిన వరస వ్యాఖ్యతగా వ్యవహరించారు.



బహుమతులు అందిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారధి ఛైర్పర్సన్ గుమ్మడి వెన్నెల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ తదితరులు

## ద్వారకామాయి పీఠంలో చండీహోమం

**సరూర్‌నగర్, మార్చి 2 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్‌లో ఆదివారం లోక కళ్యాణార్థం గణపతి చండీ హోమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రశాంతిహిల్స్ కాలనీ రోడ్ నెంబర్ 5లోని శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠంలో ప్రథమ దత్తావతారమైన శ్రీపాద శ్రీవల్లభుల వంశంలోని 34వ తరానికి చెందిన దత్త సిద్దాంత ఆదికర్త, పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ ఆధ్వర్యంలో హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఘనపాఠి వేద పండితుడు రవి శర్మ పీఠాధిపతి గోపాలకృష్ణానందక స్వామీజీ, మాతాజీ మల్లాది విజయశ్రీలచే విశ్వ కళ్యాణం నిమిత్తం హోమ పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటల తర్వాత ప్రారంభమైన హోమ క్రతువు మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగింది. చివరకు పూర్ణాహుతితో చండీహోమాన్ని పూర్తిచేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతి చండీహోమానికి జాతీయ బిజెపి కోర్ కమిటీ సభ్యుడు, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎల్‌బినగర్ అడిషనల్ డిసిపి కోటేశ్వరరావు, మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ కీసర నాగరాజు, హైదరాబాద్ సిటీ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ సురేష్, మీర్‌పేట్ ఎస్ఐలు సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


జుబ్లీహిల్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సినీనటుడు రితిక్‌రోషన్

## 10 నుంచి సైకాలజిస్టులకు శిక్షణ

**సైఫాబాద్, మార్చి 2 ప్రభాతవార్త:** సైకాలజిస్టులు సమాజంలో అత్యంత కీలకపాత్రను పోషిస్తున్నారని. తమ కౌన్సిలింగ్ ప్రక్రియల్ని మరింతగా మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ చెప్పారు. ఇందుకుగాను కౌన్సిలింగ్‌లో వినూత్న ఆవిష్కరణలకుగాను పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన హైదరాబాద్,రంగారెడ్డి జిల్లాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం బలోపేతానికి మరింతగా నాయకత్వ లక్షణాలను పెంపొందిచుకో వాల్సిన అవసరం ఉందని, సంఘ సభ్యులకు నైపుణ్యాల పెంపుదల కోసం నిరంతరం శిక్షణలు అందిస్తున్నదని, ఇందులో భాగంగా ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు హైదరాబాద్‌లో 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' (శిక్షకులకు శిక్షణ) ఈ శిక్షణ రెండు తెలుగు రాష్ట్రాల సైకాలజిస్టులు, శిక్షకులు కావాలనుకునేవారికి ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నామని ఆయన తెలిపారు. నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహకారంతో ఈ శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఏ.సుధాకర్, ఉమర్‌ఖాన్, సంయుక్త కార్యదర్శులు రాజుఆచార్య, శశికిరణ్, నాయకులు క్రిష్ణసాహితి, డాక్టర్ అర్చనా, వైదేహి, శ్రీపూజ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సైకాలజిస్టులు

# ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

### గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్

**నార్సింగి, మార్చి 2 ప్రభాతవార్త :** ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ద వహించాలని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ గంధంగూడలో ఆదిత్య క్లీనిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కేకే-2, జెఎన్నారమ్, విద్యానగర్, ఇందిరమ్మ కాలనీ, వాంబే కాలనీ, బైరాగిగూడ ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఉచితంగా వైద్యం పొందారు. అవసరమైన వారికి మందులు ఉచితంగానే పంపిణీ చేశారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ ముఖ్య అతిథిలుగా విచ్చేసి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మల్లేష్ మాట్లాడుతూ వేగంగా విస్తరిస్తున్న నగరీకరణ కారణంగా ఇక్కడి ప్రజలు యాంత్రిక జీవనంకు అలవటు పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. రోజులో ఆదాయం కోసం 8 నుంచి 12 గంటల వరకు సమయాన్ని కేటాయిస్తున్న నేటి ప్రజలు ఆరోగ్యానికి కనీసం గంట సమయమైన కేటాయించాలని సూచించారు. ఇంత శ్రమించి సంపాదించిన సొమ్ముతో సంతోషకరమైన జీవితాన్ని అనుభవించాలంటే ఆరోగ్యం సహకారించాలన్న వాస్తవాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రతీ రోజు ఉదయం ఒక గంట పాటు నడక, వ్యాయామం, కసరత్తు, ఆసనాలు, యోగ, ప్రాణాయామం ఇలా ఏదో ఒకటి చేయడంను దినచర్యలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. ఆరోగ్యంను కోల్పోతే సర్వం కోల్పోయినట్లే అని, ఆరోగ్యమే మహాభాగ్యమని మన పెద్దలు చెప్పిన ఆర్యోక్తులను నిరంతరం గుర్తుంచుకొని, ఆరోగ్యసంపాదనపై దృష్టి సారిం చాలని మల్లేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్, నాయకులు సురేష్‌గౌడ్, లక్ష్మణ్, రాందాస్, శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న తలారి మల్లేష్ ముదిరాజ్


రంజాన్ మాసం గ్రీటింగ్స్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న చంద్రశేఖర్ తదితరులు

## రంజాన్ మాసం గ్రీటింగ్స్ పోస్టర్ విడుదల

**చార్మినార్, మార్చి 2 ప్రభాతవార్త :** రంజాన్ నెల ప్రారంభం కావటంతో రంజాన్ మాసం గ్రీటింగ్స్ తెలియజేసే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్,బిజెపి మైనార్టీ మోర్చ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రి,వైభవ్ సూర్య, ఫిల్మ్,టివి నటులు భార్గవ్ రెడ్డి,కవిత,వినయ్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారని సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రి తెలిపారు.

## ఘనంగా దూసరి శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలు


శ్రీనివాస్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న లావణ్య, బుచ్చిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 2 ,ప్రభాతవార్త :** బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన సతీమణి గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి గోల్నాకలోని పార్టీ కార్యాలయంలో ఈ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భవంగా కేక్‌లను కట్‌చేసి, శాలువ, పుష్పాగుచ్చాలతో అభినందనలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లింగంగౌడ్, బుచ్చిరెడ్డి, నర్సింగ్‌యాదవ్, ఎస్.లక్ష్మణ్‌గౌడ్, గోల్నాక, నల్లకుంట, అంబర్‌పేట, కాచిగూడ డివిజన్‌కు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సన్నిహితులు పాల్గొని దూసరి శ్రీనివాస్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మారుతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సురేష్‌గౌడ్



సురేష్‌గౌడ్‌ను అభినందిస్తున్న కాలనీవాసులు

**హైదరాబాద్, మార్చి 2 ,ప్రభాతవార్త :** గోల్నాక డివిజన్ పరిధిలోని మారుతినగర్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడుగా బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సురేష్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక బస్తీ పెద్దలు, స్నేహితులు, బిఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం సురేష్‌గౌడ్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సహాయసహకారాలతో రాజకీయాలకు అతీతంగా మారుతినగర్‌బస్తీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ ఎవరికి ఏసమస్య వచ్చినా ముందుంటానని పేర్కొన్నారు. తనను బస్తీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడుగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారుతినగర్ వెల్ఫేర్ కమిటీ అడ్వాజర్లు బాలకృష్ణ, మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి, రాజులు, రమేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా మారుతినగర్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడుగా ఎన్నికైన సురేష్‌గౌడ్‌ను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అభినందించారు.

## బోనాల శ్రీనివాస్‌గుప్తకు సన్మానం


బోనాల శ్రీనివాస్‌గుప్తను సన్మానిస్తున్న దృశ్యం

**బేగంబజార్, మార్చి 2 ప్రభాతవార్త:** గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో ప్రజా ఏక్తా పార్టీ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్తనుశంకర్‌జీ, హన్‌మాన్, అయ్యప్పస్వామి టేంపుల్ ఆద్వర్యంలో శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి.నరేష్‌గౌడ్, కె.మోహన్‌గౌడ్, రాజ్‌కుమార్‌ముదిరాజ్ శివపార్వతుల ప్రసాదాన్ని అందచేశారు.

## ప్రతి వ్యక్తి లక్ష్యాలు ఏర్పరుచుకుని ప్రణాళికలను రూపొందించుకోవాలి : డా. జయప్రకాష్‌నారాయణ్

**సైఫాబాద్, మార్చి 2 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్న లక్ష్యాలు ఏర్పరుచుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. జయప్రకాష్‌నారాయణ్ చెప్పారు. ఆదివారం నాడిక్కడ అనురాగ్ యూనివర్సిటి నిర్వహించిన 'టెడ్ ఎక్స్ అనురాగ్ యూ-25' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సైయంట్ వ్యవస్థాపకుడు డా.బి.వి.ఆర్.మోహన్‌రెడ్డి, బ్లూక్రాస్ వ్యవస్థాకరాలు అక్కినేని అమలతో కలిసి ఆయన మాట్లాడారు. 'నెక్స్ ఈజ్ నౌ' అనే థీమాతో విభిన్న రంగాలకు చెందిన ఆలోచనాపరులు, ఆవిష్కర్తలు, నిపుణులను ఒకచోట చేర్చడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సాంఘిక సంస్కరణ, సాంకేతికత, వ్యవస్థాపకత, కళలకు సంబంధించిన అంశాల గురించి ప్రేక్షకులతో మాట్లాడారు. విద్యను విప్లవాత్మకంగా మార్చడం, నాయకత్వాన్ని పునర్నిర్మించడం నుంచి సృజనాత్మకత, సుస్థిరత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను పెంచడంపై చర్చలు నిర్వహించారు. కార్యక్రమంలో డెలాయిట్ సీనియర్ వైస్-ప్రెసిడెంట్ రామకృష్ణ మామిడి, ఆంసాట్ టెక్నాలజీస్ సీఈఓ రిద్ధిష్‌సోనీ, వీడియో సృష్టికర్త అగ్నివ్ వినోద్, శాండిల్య పిసాపాటి, కార్తీ సుబ్బరామన్, నిష్ఠయోగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డివిజన్‌కు రూ.99 లక్షల నిధులు

### ఎం.పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, మార్చి 2 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్‌కు మరోసారి భారీగా నిధులు మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం రామంతాపూర్ టివికాలనీ, శ్రీరమణపురం కాలనీలకు ప్రభుత్వం నుంచి రూ.99లక్షల నిధుల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ డివిజన్‌లోని శ్రీరమణపురం, టివికాలనీలో సిసి రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.99లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కాలనీలలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తిరెడ్డి, శ్రీరమణపురం అధ్యక్షుడు యాదగిరి, లుకాస్, రాఘవేందర్, భవానీ, రఘువీర్,ఇందుమతి, కవిత, కె.ఎన్.చారి, ఉమా మహేశ్వరరావు, సంతోష్, లూర్దురెడ్డి, అద్దంకి యాదగిరి, పూస శ్రీనివాస్, సాయిబాబా, శ్రీనివాస్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన విజ్ఞాన్ వైభవ్-2025

## యుద్ధ ట్యాంక్‌లు, మిస్సైల్స్ చూసేందుకు ఆసక్తి చూపిన ప్రజలు

**గచ్చిబౌలి, మార్చి 2 ప్రభాతవార్త**

గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియం ఆదివారం కిక్కిరిసింది. భారత రక్షణ రంగ శక్తి సామర్థ్యాలను సామాన్యులకు తెలియజేసే విధంగా గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఆయుధాల ప్రదర్శనను తిలకించేందుకు నగర ప్రజలు బారులు తీరారు. రక్షణ శాఖ అమ్ములపొదిలో ఉన్న అత్యాధునిక క్షిపణులు, రాకెట్ లాంచర్లు, యుద్ధ ట్యాంకులు, వార్‌హెడ్‌లు, డ్రోన్‌లను చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని జీఎంసి బాలయోగి స్టేడియంలో శు క్రవారం ప్రారంభమైన విజ్ఞాన్ వైభవ్-2025 ప్రదర్శన ఆదివారం ముగిసింది. శుక్రవారం భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన ఈ ప్రదర్శన శని, ఆదివారాలు సాధారణ సందర్శకుల కోసం అందుబాటులో ఉంచగా, నగర ప్రజలు భారీఎత్తున తరలివచ్చిరు. ఆదివారం సెలవుదినం కావడంతో సందర్శకులు తమ చిన్నారులతో కలిసి కుటుంబసమేతంగా ప్రదర్శనకు వచ్చి రక్షణ పరికరాలను చూశారు. నగరంలో మొదటిసారిగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో భారత త్రివిధ దళాలు ఉపయోగించే అత్యాధునిక ఆయుధ సామాగ్రిని ప్రదర్శనలో ఉంచారు. మొత్తం 220 స్టాళ్లను ఏర్పాటు చేసి రక్షణ రంగ ఉత్పత్తులు, టెక్నాలజీలను, ఆయుధాలు, విడిభాగాలను, ఎయిర్ ఫోర్స్ టెక్నాలజీ, ఫ్లయింగ్ క్లాత్స్ ప్రదర్శనకు ఉంచారు. డిఆర్‌డిఎల్, డిఆర్‌డిఓ, ఇస్రో, మిథాని, బీడిఎల్, బిఈఎల్, ఈసిఐఎల్‌లు రూపొందించిన ఆయుధాలు, స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఆయుధ సామాగ్రిని స్టాళ్లలో ఏర్పాటు చేశారు. అగ్ని, బ్రహ్మోస్, ఆకాష్, ప్రళయ్ వంటి బాలిస్టిక్ క్షిపణులు ప్రదర్శనకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. త్వరలో భద్రతాదళాల చేతికి చేరనున్న మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ ఎంపిఏటిజిఎం మిస్సైల్స్ వివరాలను అధికారులు సందర్శకులకు వివరించారు. పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే దక్ష్ డిఫ్యూజర్, గాలిలోనుంచి భూమి మీదకు ప్రయోగించే రు ద్రం మిస్సైల్, ఫైరింగ్ రేంజ్‌లో వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్న ఆర్టిలరీ గన్ సిస్టం, శత్రువుల హెలికాప్టర్లు, ఎయిర్ క్రాఫ్ట్‌లు, యుఏవిలను కూల్చివేసే క్యూఆర్‌ఎస్‌ఏఎం మిస్సైల్స్, భూమి మీద, నీటిలో ప్రయాణించే వీల్ యుద్ధ ట్యాంక్‌లు, అరు ్జన్ యుద్ధ ట్యాంక్‌లు, డ్రోన్ ఫైరింగ్ గన్‌లను సందర్శకులు ఆసక్తిగా పరిశీలించరు. రక్షణ, నావికాదళ, ఎయిర్ ఫోర్స్ అధికారులు ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఆయు ధాలు, టెకా ్నలజీల వివరాలను సందర్శకులకు వివరించారు.






ప్రదర్శనలో ఉంచిన ప్రళయ్ క్షిపణులు, పక్కన సందర్శకులతో కిక్కిరిసిన గచ్చిబౌలి స్టేడియం

## బహుజనుల రాజ్యాధికారం కోసం ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలి

**చిక్కడపల్లి, మార్చి 2 ప్రభాతవార్త:**

ఆత్మగౌరవం, సమాన అభివృద్ధి, రాజ్యాధికారంల భాగస్వామ్యం లక్ష ్యంగా తెలంగాణల బహుజనులు సంఘటిత ఉద్యమం చేయాలని సామాజిక న్యాయ జేఏసీ పిలుపునిచ్చింది. దేశవ్యాప్త కులజన గణన చేయాలని, దామాషా రీతిల చట్ట సభలల్ల బీసీలకు రిజర్వేషన్లు కలిపించాలని, జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయించాలని సామాజిక న్యాయ జేఏసీ డిమాండ్ చేసింది. అనేక సామాజిక ఉద్యమాలు, త్యాగాలు చేసిన బహుజనులకు అధికారంల భాగస్వామ్యం లేకపోవడానికి సొంత పార్టీ పెట్టుకోకపోవడమే కారణమని సామాజిక న్యాయ జేఏసీ అభిప్రాయపడ్డది. కాన్షిరాం జయంతిని పురస్కరించుకొని మార్చ్ 15 శనివారం బహుజనుల రాజ్యాధికార సాధన సమాలోచన సమావేశం హైదరాబాద్ ల ఏర్పాటు చేస్తున్నామని సామజిక న్యాయ జేఏసీ తెలిపింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని డిక్కి ఆఫీస్ సమావేశ మందిరంలో సమావేశమవుతున్నట్లు, తెలంగాణల రాజ్యాధికారమే లక్ష ్యంగా బహుజనులు ఓటు చైతన్యం పెంచడానికి సంఘటితంగా ఉద్యమించాలని సామాజిక న్యాయ జేఏసీ పిలుపునిచ్చింది. ఆదివారం సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, నాయకులు మేకపోతుల నరేందర్ గౌడ్, డాక్టర్లు ఎం ఫ్ గోపినాథ్, ఎం ఏ షోయబ్, ప్రతిభ లక్ష ్మ ముదిరాజ్, శివ ముదిరాజ్, దాసోజు లలిత, అడ్వకేట్స్ పేరం అలేఖ్య, మల్లికంటి, ప్రొఫెసర్లు ననుమాస స్వామి, గాలి వినోద్, వెంకన్న, బెక్కం జనార్దన్ సొగరా బేగం, రోజానేత, వాగ్గేయకారులు వరంగల్ శ్రీనివాస్, మచ్చ దేవేందర్, రెంజర్ల రాజేష్, వనపర్తి నరేందర్ గౌడ్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, గురిజాల రవీందర్ తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. స్వతంత్రం వచ్చి 75 ఏండ్లు. అమృతోత్సవాలు

# అవుట్ పేషెంట్‌గా పేర్లు నమోదే నరకం

*** తెల్లవారుజాము నుంచే క్యూలు * సమయం దాటితే మరుసటిరోజే * ప్రభుత్వ ఆస్పత్రులలో రోగుల కష్టాలు**

**హైదరాబాద్, మార్చి 3 ప్రభాతవార్త :** పేద ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించడం తెలికే. ఓపీ చీటీ తీసుకోవడమే పెద్ద నరకంగా తయారైది. చాంతాడంత క్యూలో నిలబడి చీటీ తీసుకోవడానికి కుస్తీలు పడాల్సి వస్తోంది. పరోక్షంగా ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించడం అంటే నరకాన్ని అనుభవించడమే అంటున్నారు రోగులు, వారి బంధువులు. నగరంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యంచేయించుకోడానికి రాష్ట్రంలోని జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి రోగులు వస్తుంటారు. వారివారి రాష్ట్రాలలో కంటే హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందని నమ్మకం. వైద్యం విషయం పక్కనపెడితే అవుట్ పేషెంట్ చీటీ తీసుకోవడమే పెద్ద టాస్క్‌గా మారింది.



**సమయం పెంచాలని డిమాండ్ ఉన్నా....**

సాధారణంగా ఉదయం 8.30 నుంచి ఉదయం 11.30 వరకు మాత్రమే ఓపీలు పనిచేస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో ఓపీ చీటీ తీసుకోడానికి ఈ సమయం సరిపోవడం లేదని, సమయాన్ని సాయంత్రం నాలుగింటి వరకు పెంచాలని రోగుల నుంచి ఎంతో కాలంగా డిమాండ్ ఉన్నప్పటికి అధికారలు మాత్రం అమలులోకి తేవడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రతిరోజు దాదాపు వెయ్యి నుంచి రెండు వేల వరకు రోగులు వైద్యం చేయించుకోడానికి ఆస్పత్రులకు వస్తుంటారు. ఓపీ చీటీ తీసుకోడానికి గంటల సమయం క్యూలో నిలబడినప్పటికి చీటీ దొరుకుతుందో లేదో అనే ఆందోళన చెందుతుంటారు. ఉదయం 8.30 నుంచి 11.30 వరకు మాత్రమే ఓపీ చీటీలు ఇస్తుండడంతో చీటీ కోసం గంటల సయమ వేచి ఉండాల్సి న పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ చీటీ దొరుకుతుందనే నమ్మకం ఉండడం లేదు. ఆస్పత్రులకు కొంత దూరంలో ఉండేవారి పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఓపీ చీటీ తీసుకోడానికి తెల్లవారుజాము నుంచే క్యూలు కట్టాల్సి న పరిస్థితి నెలకొంది. కొందరైతే ముందురోజు రాత్రే ఆస్పత్రికి వచ్చి ఆస్పత్రి ప్రాంగణంలో సమయాన్ని గడిపి తెల్లవారుజామున నాలుగింటికి క్యూలో నిలబడుతున్నారు. ఇలాంటి వారి పరిస్థితి దారుణంగా ఉంటోంది. స్నానాలు, టిఫిన్‌ల లాంటివి తీసుకోకుండానే వైద్యులను సంప్రదించాల్సి న పరిస్థితి. ఓపీ చీటీ ఇచ్చే సమయం గడిచిపోతే మరుసటి రోజు రావాల్సి ందిగా సూచిస్తున్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఎంతో బాధపడుతున్నారు. కొందరైతే సిబ్బందిని నానా తిట్లు తిడుతున్నారు.

**వైద్యులపై పడుతున్న భారం....**

ప్రభుత్వ ఆస్పత్రులలో రోగుల సంఖ్య నానాటికి పెరుగుతుండడంతో వైద్యులపై తీవ్ర భారం పడుతోంది. ముఖ్యంగా శనివారం, సోమవారం, మంగళవారాల్లో రోగుల సంఖ్య మరింత పెడుగుతోంది. దీంతో వైద్యలు సరైన సేవలు అందించలేకపోతున్నారు. ఒక్కో వైద్యుడు దాదాపు వందల మందిని చూడాల్సి న పరిస్థితి నెలకొనడంతో కొన్నిసార్లు వైద్యులు చేతులెత్తేస్తున్నారు. కేవలం మూడు, నాలుగు గంటల్లోనే అపరిమిత సంఖ్య లో రోగులకు వైద్యం చేయాల్సి వస్తోంది. ఓపీలో పేరు నమోదు చేసుకున్న వారందనికి వైద్యం చేయాల్సి ందే. దీంతో వైద్యులు ఒక్కొక్క రోగికి కేటాయించాల్సి న సమయం నామామాత్రంగా ఉంటోంది. రోగి బాధలను పూర్తిస్థాయిలో వినకుండానే వైద్యం చేసే పరిస్థితి నెలకొంటోంది. ఇదిలా ఉండగా వైద్యలు రోగి పరిస్థితిని బట్టి పరీక్షలు చేయించాల్సి వస్తే ఇక్కడ కూడా గంటల సమయం వేచిఉండే పరిస్థితి. పరీక్షలు జరిపించుకొని వైద్యుల వద్దకు వెళితే అప్పటికే సమయం మించిపోవడంతో మరుసటి రోజు వరకు రోగి అవస్థలు పడాల్సి ందే. ఒకవేల రోగిని అడ్మిట్ చేసుకునే అవసరం ఉన్నప్పటికి డాక్టర్‌ను కలవడం, పరీక్షలు జరిపించుకోవడంతోనే రోజుంతా గడిచిపోతోంది.

దీంతో రోగుల అవస్థలు అన్నిఇన్నికావు. ఎమర్జెన్సీ అయితే తప్ప వైద్య జరిపించుకోవడం రోగులకు నరకప్రాయంగా మారింది.

**ఓపీ సమయం పెంచితే....**

అత్యవసర విభాగంలో వైద్యలు విధులు నిర్వహించగలిగితే రోగుల బాధలు తప్పే పరిస్థితిలేదు. ఎంతో కాలంగా రోగుల నుంచి వస్తున్న ఓపీ సమయాన్ని పెంచాలనే డిమాండ్ నెరవెరితే తప్ప పరిస్థితి మారేలా లేదు. బిఆర్ఎస్ అధికారంలో ఉండగా రోగుల అవస్థలు విన్న అప్పటి మంత్రి ఓపీ సమయాన్ని పెంచాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ ఇబ్బందులు ఏమున్నా ఓపీ సమయాన్ని మాత్రం పెంచడం లేదు. రోగి రోజాంతా ఏ సమయంలో వచ్చిన వైద్య సేవలు పొందే విధంగా ఆస్పత్రులు సేవలు అందించగలిగితే తప్ప పరిస్థితులు మారేలాలేదు. ఓపీ సమయం పెంచి, రోగిని జరాగాల్సి న వైద్య పరీక్షలు పూర్తి చేసుకొని ఆదేరోజు వైద్యం చేయించుకునే అవకాశం కల్పించాల్సి న అవసరం ఉంది.

# నగరంలో అనధికార స్కూళ్లు

- పర్యవేక్షణ కొరవడిన ప్రైవేటు బడులు
- చూసీచూడనట్లుగా అధికారగణం
- సందుగొందుల్లో విచ్చలవిడిగా ప్రైమరీ పాఠశాలలు
- ఉన్నత చదువుల్లో విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



**హైదరాబాద్, మార్చి 2 ప్రభాతవార్త**

గ్రేటర్‌లో కొన్ని ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నాయి. నగరంలో ప్రైవేటు స్కూళ్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కాలనీలు, బస్తీల్లో వందలాదిగా ఏర్పాటవుతున్నాయి. విద్యాశాఖ ప్రమాణాలు పాటించకుండా ఇరుకు గదుల్లో కొందరు నెల కొల్పుతున్నారు. డీఈడీ, బీఈడీ లాంటి కోర్సులను పూర్తిచేయని వారిని ఉపాధ్యాయులుగా నియమించుకుని పిల్లలకు పాఠాలు బోధిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారు. అయితే గుర్తింపు లేని పాఠశాలల్లో చదివిని విద్యార్థులకు ఉన్నత చదువుల సమయంలో ఇబ్బందులు ఎదురవుతుండడంతో తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. నగరంలో ప్రైవేటు విద్య కొన్నేళ్లుగా వ్యాపారంగా మారింది. నగరంలోఉన్న మొత్తం ప్రైవేట్ స్కూళ్లలో నాలుగోవంతు స్కూళ్లు ఎలాంటి గుర్తింపు లేకుండా కొనసాగుతున్నాయి. వీటిలో ప్రైమరీ స్థాయి స్కూళ్లు అధికం. కాలనీలు, బస్తీల్లో నడుస్తున్న ఇటువంటి స్కూళ్లలో కనీస విద్యా ప్రమాణాలు లేకపోవడంతో విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారుతోంది. హైదరాబాద్ జిల్లాల్లో మొత్తం 2,284 ప్రైవేటుస్కూళ్లలో 1,886 వరకే గుర్తింపు ఉండగా, మిగతా 398 ఎలాంటి అనుమతి లేకుండా నడస్తున్నట్లు తెలిసింది. వాస్తవంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు పాఠశాలలను ఏర్పాటు చేయాలంటే 24 శాఖలకు సంబంధించిన నోడ్యూ సర్టిఫికెట్లు విద్యాశాఖకు సమర్పించల్సి ఉంటుంది. అందులో ప్రధానంగా భవన రిజిస్ట్రేషన్, ఆటస్థలం, ఫైర్‌సేఫ్టీ, పాఠశాలల చుట్టూ ప్రార్థన మందిరాలు, మద్యం దుకాణాలు లేకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆయా శాఖల నుంచి అనుమతి తీసుకుని శాఖల నుంచి అనుమతి తీసుకుని విద్యాశాఖకు దరఖాస్తు చేసుకుంటే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి పర్మిషన్ ఇస్తుంటారు. అయితే నగరంలోని చాలుచోట్ల ఈ నిబంధనలు పాటించకుండా ఒకటి నుంచి 5వ తరగతి వరకు 40 నుంచి 70 మందితో రెండు, మూడు గదులను అద్దెకు తీసుకుని దర్జాగా స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నారు. పలుచోట్ల 10వ తరగతి వరకు కూడా నిర్వహిస్తున్నారు. నెలకు రూ.500 రూ.800 వరకు మాత్రమే ఫీజు తీసుకుని పాఠాలు బోధిస్తున్నామని చెబుతుండడంతో నిరుపేద తల్లిదండ్రులు వాటివైపు మొగ్గ చూపుతున్నారు.

నగరంలోని గోల్కొండ, ఆసిఫ్‌నగర్, నాంపల్లి, అమీర్‌పేట, అంబర్‌పేట, ఖైరతాబాద్, ముషీరాబాద్, సికింద్రాబాద్, చంద్రాయణగుట్ట, చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో అనధికారిక ప్రైవేటు స్కూళ్లు ఎక్కువగా ఉన్నాయి. ఆయా పాఠశాల నిర్వాహకులు విద్యార్థులకు సంబంధించిన నామినల్ రూల్స్‌ను ఇతర గుర్తింపు ఉన్న పాఠశాలల నుంచి చూపిస్తూ యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్(యూడైస్)కు సమర్పిస్తున్నారు. దీంతో పరీక్షలు రాసిన తర్వాత సర్టిఫికెట్లు తాము చదివిన స్కూల్ నుంచి రాకఉండా ఇతర పాఠశాల నుంచి వస్తుండడంతో విద్యార్థులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును ఇతర పాఠశాలల నుంచి కట్టిస్తుండడంతో వారు పాసైన తర్వాత టీసీలు, లాంగ్‌మెమోలు సర్టిఫికెట్లను పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**పర్యవేక్షణ లోపంతో ఇష్టారాజ్యం...**

మండలాల్లో నడుస్తున్నా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లను డిప్యూటీ ఈఓలు, డిప్యూటీ ఐఓఎస్‌లు (మండల విద్యాధికారులు) తరచూ పర్యవేక్షించాలి. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధనలు అందిస్తున్నారా, షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తున్నారా, క్వాలిఫైడ్ టీచర్లు అందుబాటులో ఉన్నారా తదితర విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. ఇదే సమయంలో గుర్తింపు లేని వాటిని రద్దు చేయాలి. అయితే స్కూళ్లను రెండు, మూడు నెలలకోసారి తనిఖీ చేయకపోవడంతో నిర్వాహకులు ఫీజులు దోపిడీకి పాల్పడుతున్నారు. ఇలాఉండగా, రెండు వారాల క్రితం ఓ మండలంలో అనధికారికంగా నడుస్తున్నా స్కూల్ నుంచి కొంత మొత్తాన్ని తీసుకుని అక్కడి విద్యార్థుల నామినల్ రోల్స్‌ను గుర్తింపుఉన్న పాఠశాల నుంచి యూడైస్‌లో సమర్పించినట్లు సమాచారం. నగరంలో అనధికారికంగా నడస్తున్న ప్రైవేటు పాఠశాలలను అరికట్టాలని పలు విద్యార్థుల సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి.

## మీనాక్షి నటరాజన్‌ను కలిసిన పిసిసి నేత సంగిశెట్టి జగదీశ్వర్

**చిక్కడపల్లి, మార్చి 2 ప్రభాతవార్త:**

అఖిలభారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసిసి) తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను ఆదివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని నటరాజన్ సూచనలు చేశారు.



ఎఐసిసి రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిసిన సంగిశెట్టి జగదీశ్వర్



న్యాయమూర్తిని సన్మానిస్తున్న ఉప్పల స్వప్న శ్రీనివాస్‌గుప్తా

## మహిళా భాగస్వామ్యంతోనే అభివృద్ధి:ఉప్పల

**ఎల్.బి.నగర్, మార్చి 2 ప్రభాతవార్త:**

మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలని మహిళా భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు నాగోల్ పిబిఆర్ కన్వెన్షన్ హాల్లో సుమారు పదివేల మంది మహిళలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురపల్లి నందా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు నిర్ణయాలు తీసుకోవడం, రాజకీయ క్రియాశీలత, రాజకీయ స్పృహ పెంపొందించుకోవడం పట్ల అభినందించారు. ప్రభుత్వ కార్యాలయాలలో పురుషుల కంటే మహిళలు ఎక్కువ పోటీ ఇస్తున్నారన్నారు. రాజకీయ క్రియాశీలత ఓటింగ్ రంగాలలో మహిళల రాజకీయ భాగస్వామ్యం బలంగా ఉంటుంది. రాజకీయాల్లో లింగ అసమానతలను రూపుమాపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రబుత్వాలు మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ స్త్రీఆర్థిక స్వేచ్ఛ దుర్వినియోగం వల్ల కుటుంబ వ్యవస్థ బలహీన పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐవిఎఫ్ న్యూఢిల్లీ ప్రెసిడెంట్ అశోక్ అగర్వాల్, న్యూఢిల్లీ సలహా కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, సెన్సార్‌బోర్డు సభ్యుడు డాక్టర్ మొగులపల్లి ఉపేందర్‌గుప్తా, ఎస్ఎస్. కపుల్, కవిరాజు కపుల్, ఆక్ట్రిస్ సంధ్యజానక్, డాక్టర్ రమ్యశ్రీ, లక్ష్మీవర్మ, చంచల్‌శర్మ, నటి సనా, మిస్ తెలంగాణా సుప్రజారెడ్డి, ఉప్పల స్వప్న, కటకం శ్రీనివాస్ పాల్గొన్నారు.



బేగంపేట ట్రాఫిక్ అడిషినల్ డిసిపిగా బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాలరెడ్డిని సత్కరిస్తున్న ట్రాఫిక్ ఏసిపి శంకరరాజు

## బేగంపేట ట్రాఫిక్ అడిషినల్ డిసిపిగా వేణుగోపాలరెడ్డి

**బేగంపేట మార్చి 2, ప్రభాతవార్త :**

బేగంపేట ట్రాఫిక్ అడిషినల్ డీసీపీగా సీ.వేణుగోపాలరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ట్రాఫిక్ అడిషినల్ డీసీపీగా విధులు నిర్వర్తించిన సాలె రంగారావు పదవీ విరమణ చేసారు. అప్పటి నుంచి ఈ స్థానం ఖాళీగా ఉంది. తాజాగా వేణుగోపాల రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. 1991బ్యాచ్‌కు చెందిన వేణుగోపాలరెడ్డి ఎస్సైగా విధులలో చేరారు. ఎస్సైగా గాంధీనగర్, రాంగోపాల్‌పేట, ఛార్మినార్, మోండా మార్కెట్ ట్రాఫిక్ పీఎస్‌లలో విధులు నిర్వర్తించారు. అనంతరం ఇన్స్‌పెక్టర్ గా బోయిన్‌పల్లి, ఛార్మినార్, హైదరాబాద్ సీటీ స్పెషల్ బ్రాంచ్‌లలో విధులు నిర్వర్తించారు. అనంతరం డీఎస్పీగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో చేసారు. అనంతరం సైఫాబాద్ ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వర్తించారు. అనంతరం మేడ్చల్ ట్రాఫిక్ డిప్యూటీ కమీషనర్‌గా విధులు నిర్వర్తించారు. తాజాగా బేగంపేట ట్రాఫిక్ అడిషినల్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా నగర పోలీసు కమీషనర్ సీ.వీ.ఆనంద్‌ను వేణుగోపాల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. కృతజ్ఞతలు తెలియజేసారు. వేణుగోపాల్‌రెడ్డి సేవాపతకం, ఉత్తమ సేవా పతకం, ఇండియన్ పోలీసు మెడల్ (ఐపీఎమ్) పొందారు. ఈ సందర్భంగా వేణుగోపాలరెడ్డిని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు కలిసి శాలువాతో సత్కరించి ,బొకే అందజేసారు.

# జిఎస్ఐ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లో వాకథాన్

**175వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న భారతీయ భువైజ్ఞానిక సర్వే సంస్థ(జిఎస్ఐ)**

**బేగంపేట మార్చి 2,ప్రభాతవార్త :** భారతీయ భువైజ్ఞానిక సర్వే సంస్థ (జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా) ప్రారంభమై 175 సంవత్సరంలో అడుగిడిన సందర్భంగా సంజీవయ్య చిల్డ్రన్‌పార్క్ నుంచి నెక్లెస్ రోడ్డులో ఆదివారం వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వం, గనుల మంత్రిత్వశాఖ అనుబంధ సంస్థ అయిన భారతీయ భువైజ్ఞానిక సర్వేసంస్థ(జీఎస్ఐ) 1851 లో స్థాపించారు. ప్రపంచంలోనే రెండవ అతి పురాతన, పెద్ద భువైజ్ఞానిక సర్వేసంస్థ జీఎస్ఐ 175వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హైదరాబాద్‌లోని జీఎస్ఐ దక్షిణ క్షేత్రం, శిక్షణా సంస్థ ప్రధాన కార్యాలయం సంయుక్తంగా ఉదయం 8 గంటలకు ట్యాంకుబండ్ సంజీవయ్య చిల్డ్రన్స్‌పార్కు వద్ద వాక్‌థాన్ నిర్వహించారు. ఈ వాక్‌థాన్ ద్వారా దేశాభివృద్ధికి 175 సంవత్సరాల నుంచి జీఎస్ఐ అందిస్తున్న సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నడక వల్ల కలిగే శారీకక, మానసిక శ్రేయస్సు గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా జీఎస్ఐ దక్షిణ క్షేత్ర కార్యాలయం నిర్వహించిన పనుల మీద రాసిన సావనీర్ (పుస్త కాన్ని) అదనపు డైరక్టర్ జనరల్, దక్షిణ క్షేత్ర హెడ్ ఎస్.డి.పాట్బాజే ఇతర జీఎస్ఐ అధికారుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ ఖనిజాలు, శిలలు, ఇంధనాలు, శిలాజాల నమూనాలను స్టాల్‌లో ప్రదర్శించారు. జీఎస్ఐ 175 సంవత్సరాల నుంచి దేశానికి చేసిన అద్భుత మైన సేవలకు ప్రతీకగా 175 త్రివర్ణ బెలూన్‌లను విడుదల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంజీవయ్య చిల్డ్రన్స్ పార్కు వద్ద ప్రారంభమైన ఈ వాక్‌థాన్ నెక్లెస్ రోడ్డు మీదుగా స్ఫూర్తిస్థల్ వరకు వెళ్లి తిరిగి సంజీవయ్య చిల్డ్రన్స్ పార్కువద్దకు చేరుకుని ముగించారు. కార్యక్రమంలో జీఎస్ఐ ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది, విధ్యార్థులు, విద్యావేత్తలు, జియో సైంటిస్టులు, భారతీయ భువైజ్ఞానిక సర్వే సంస్థ ప్రజా సం బంధాల అధికారి మల్లేష్ గంజి పాల్గొన్నారు.




భారతీయ భూవైజ్ఞానిక సర్వేసంస్థ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లో నిర్వహించిన వాక్‌థాన్



తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో భక్త రామదాసు జయంతి ఉత్సవాలు సందర్భంగా ఏర్పాటుచేసిన సంగీత కార్యక్రమంలో పాల్గొన్న సంగీత కళాకారులు

## 4న శ్రీరామశతకం పుస్తకావిష్కరణ

నారాయణఖేడ్, మార్చి 2, ప్రభాతవార్త:
సాహితీ కళాప్రవీణ స్వర్ణకంకణ సత్కార గ్రహీత, పద్యశిల్పి, యువ అవధానిచే రచించిన 44వ అష్టావధాన, పద్యకవి, సిహెచ్ భూమయ్య రచించిన శ్రీరామశతకం ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 4వతేదీన చాప్టా (కె) జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ నరసింహులు తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, శంకరాభరణం బ్లాగు నిర్వాహకులు కంది శంకరయ్య, సమస్యాపృచ్ఛకచక్రవర్తి వరంగల్‌లు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమానికి తెలుగు భాషాభిమానులు, రచయితలు హాజరై ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నరసింహులు సూచించారు.

## ఏడుపాయల్లో భక్తుల సందడి


ఏడుపాయల వనదుర్గామాత దర్శనానికి బారులు తీరిన భక్తులు

పావన్నపేట, మార్చి 2, ప్రభాతవార్త:
భక్తుల కోరికలుతీరుస్తూ భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఏడుపాయల వనదుర్గాభవానీమాత ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆలయానికి ఆయాప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని తమ మొక్కుబడిలోభాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీరపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి వనదుర్గమ్మకు బోనాలు సమర్పించి ఒడిబియ్యంనింపి కుంకుమార్చన, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు పడకుండా ఆలయ ఈఓ చంద్రశేఖర్, ఆలయసిబ్బంది రవికుమార్ సూర్య శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, నర్సింలు, వరుణాచారి, భత్తిని రాజు, యాదగిరి, శ్రీకాంత్‌ల సహకారంతో తగుచర్యలు తీసుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్‌లు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తన సిబ్బందితో నిఘా ఏర్పాటుచేశారు.

## ముస్లాపూర్‌లో సిసిరోడ్డు నిర్మాణానికి శ్రీకారం


సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అల్లాదుర్గం, మార్చి 2, ప్రభాతవార్త:
మండలపరిధిలోని ముస్లాపూర్‌లో సిసిరోడ్డు నిర్మాణానికి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్‌గుప్తా పూజాకార్యక్రమాలు నిర్వహించి రోడ్డు నిర్మాణపనులకు ఆదివారం శ్రీకారంచుట్టారు. ఈసందర్భంగా ముస్లాపూర్ గ్రామ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సురేష్‌గుప్తా మాట్లాడుతూ 5లక్షల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్‌నిధులతో సిసిరోడ్డునునిర్మిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే గ్రామాలు అభివృద్ధిబాటలో పయనిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు టెక్మాల్ వెంకట్, నాయకులు చక్రపాణి, రాజు, మైనుద్దీన్, పుండరీకం, రాజ్‌కుమార్, దుర్గయ్య, కిష్టయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మార్కండేశ్వర ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపన

-హాజరుకానున్న మహర్షులు, సాధుసంతు


విగ్రహాల ప్రతిష్ఠాపనకు ముస్తాబైన మార్కండేశ్వరాలయం

నారాయణఖేడ్, మార్చి 2, ప్రభాతవార్త:
పట్టణంలోని వెంకటాపూర్ చౌరస్తాలో కొత్తగా నిర్మించిన మార్కండేశ్వర ఆలయంలో ఈనెల3వ తారీఖునుంచి 6వతేదీవరకు విగ్రహాల ప్రతిష్ఠాపన పూజాకార్యక్రమాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, పద్మశాలీలు పేర్కొన్నారు. యతీశ్వరులు, మునులు, సాధుసంతులు, ప్రముఖులసమక్షంలో ఆలయంలో బ్రహ్మసూత్రలింగాన్ని ప్రదర్శించనున్నట్లు బ్రహ్మశ్రీ గురురాజుశర్మ పేర్కొన్నారు. తమిళనాడురాష్ట్రం మహాబలేశ్వరంనుంచి తీసుకువచ్చిన విగ్రహాలను రంగస్థలం పీఠాధిపతులు మాధవానందసరస్వతీమహారాజ్ నేతృత్వంలో విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. విగ్రహాల ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని పూజాకార్యక్రమాలు నిర్వహించి స్వామివారి కృపకు పాత్రులుకావాలని నిర్వాహకులు, ఆలయ అర్చకులు సూచించారు.

## మరమ్మతులకోసం రోడ్డెక్కిన ప్రజలు

-గోతుల్లో మట్టిపోసి చిన్నారి నిరసన


రోడ్డుపై గోతుల్లో చిన్నారి మట్టినినింపి నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

రామచంద్రాపురం, మార్చి 2, ప్రభాతవార్త:
దశాబ్దకాలంగా రోడ్డుప్రమాదాలకు కారణమైన ఆర్ఆర్30రోడ్డును బాగుచేయాలని డిమాండ్‌చేస్తూ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 300 మంది ప్రజలు ఆదివారం రోడ్డెక్కి నిరసన వ్యక్తంచేశారు. రోడ్డుపై ఏర్పడ్డ గోతుల్లో చిన్నారులు తట్టలో మట్టితీసుకువచ్చి గోతులుపూడ్చి, రోడ్డును ఊడుస్తూ వినూత్నరీతిలో నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గతంలో పలుమార్లు రోడ్డుబాగుచేయాలని నిరసన వ్యక్తంచేసిన ప్రతిసారీ తూతూమంత్రంగా పనులుచేసి అధికారులు, పాలకులు చేతులు దులుపుకున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఓప్రముఖ నిర్మాణసంస్థ నిర్వాకం మూలంగానే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నామని, ఆసంస్థ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకుపోయి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు అభివృద్ధిపనులు వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# నర్సారెడ్డిపై విమర్శలు చేస్తే సహించం

-నాయిని యాదగిరికి రాజకీయ భిక్ష పెట్టింది నర్సారెడ్డి
-గజ్వేల్ మార్కెట్‌కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వంటేరు నరేందర్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 2, ప్రభాతవార్త:
టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరిని తెలుగుదేశంనుండితన్నితరిమేస్తే కాంగ్రెస్‌పార్టీలో రాజకీయ భిక్షపెట్టిన మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సర్దార్ ఖాన్, ఆయా మండలపార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తమ్మలి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, సందీప్, లింగారావు, కృష్ణగౌడ్, మాజీ ఎంపిపి మోహన్, గజ్వేల్‌పట్టణ ప్రధానకార్యదర్శి నక్క రాములుగౌడ్, రవీందర్‌గుప్త, సాజిద్‌బేగ్, సమీర్‌లు హెచ్చరించారు. ఆదివారం గజ్వేల్‌పట్టణంలోని ఓప్రైవేట్ ఫాంహౌజ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నామినేటెడ్ పదవులకోసం పాకులాడుతున్న నాయిని యాదగిరి, మద్దూరి మల్లారెడ్డి, శ్రీనివాస్‌గుప్తలాంటి వ్యక్తులకు పార్టీ పదవులను కట్టబెట్టిన నర్సారెడ్డిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. వారు గత చరిత్ర గుర్తుచేసుకుంటే బాగుంటుందని, కనీసం కౌన్సిలర్‌గా గెలవని నాయిని యాదగిరి గజ్వేల్ కాంగ్రెస్‌పార్టీలో విభేదాలు సృష్టిస్తూ పక్కపార్టీ నేతలతో స్నేహపూర్వకంగా ఉంటున్నారన్నారు. వందల ఎకరాల ఆస్తులను కలిగి ఉన్న నర్సారెడ్డి రాజకీయం కోసమే ఆస్తులు అమ్ముకొని అప్పులపాలు అయినా కాంగ్రెస్‌పార్టీ బలోపేతం కోసం కష్టపడుతున్నారన్నారు. పదేళ్ళ కెసిఆర్ ప్రభుత్వంలో ఇప్పుడు విమర్శిస్తున్న నాయకులు ఎక్కడ దాక్కున్నారన్నారు. 2014 ఎంపి ఉప ఎన్నికల సమయంలో అప్పటి ఎన్నికల ఇంచార్జ్‌గా మంత్రి గీతారెడ్డి, టిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ వంశీచంద్‌రెడ్డి గజ్వేల్‌కువచ్చిన సందర్భంగా మద్దూరి మల్లారెడ్డితో మాట్లాడగా ఆయన చేతులెత్తేసిన విషయం గుర్తుకుతెచ్చుకోవాలని స్పష్టం చేశారు. 2014 మున్సిపల్ ఎన్నికల్లో నాయిని యాదగిరి ఆడిన రాజకీయక్రీడ వల్ల కాంగ్రెస్‌పార్టీని భ్రష్టుపట్టించారని పేర్కొన్నారు. మాజీఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి వెన్నుపోటు పొడుస్తూ మున్సిపల్ ఎన్నికల లక్ష్యంగా ఇతర పార్టీలవైపు చూస్తున్నట్లు విమర్శించారు. నాయిని యాదగిరి నర్సారెడ్డిపై విమర్శలు చేయడం సరైంది కాదని హెచ్చరించారు. గజ్వేల్ మార్కెట్‌కమిటీ చైర్మన్ పదవి కోసమే నాయిని యాదగిరి కొత్తనాటకానికి తెరలేపగా, రిజర్వేషన్‌లో భాగంగా ఓసికేటగిరి వస్తే ఆయనకు పదవిని ఎలాయిస్తారని ప్రశ్నించారు. నాయిని యాదగిరి వెన్నుపోటు రాజకీయాలను ఆధారాలతో కాంగ్రెస్ అధిష్ఠానందృష్టికి తీసుకెళ్తామని, కాంగ్రెస్‌పార్టీ క్రమశిక్షణచర్యల కింద నాయిని యాదగిరిపై,ఇతర నేతలపై అధిష్ఠానం చర్యలుతీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుకేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఏఎంసిడైరెక్టర్ డాక్టర్ వహీద్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, జంగం రమేష్‌గౌడ్, బెజుగామ శివారెడ్డి, గుంటుకు శ్రీనివాస్, అంజద్, నీల శ్రీనివాస్, డాక్టర్ యాదగిరి, బాల్‌రెడ్డి, కిషన్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, హజార్, దప్పు గణేష్, బాలాగౌడ్, కొడకండ్ల బాలు, గుండు లక్ష్మణ్, శివులు తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం

-విద్యుత్ శాఖ డైరెక్టర్ సాయిబాబా


విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ డైరెక్టర్ సాయిబాబా

ములుగు, మార్చి 2, ప్రభాతవార్త:
రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్‌శాఖ డైరెక్టర్ సాయిబాబా పేర్కొన్నారు. ములుగుమండలంలోని 33కెవి క్షీరసాగర్, 133 కెవి తునికిబొల్లారం సబ్‌స్టేషన్లను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేవేసవిని దృష్టిలోపెట్టుకొని ప్రజలకు, రైతులకు ఎలాంటి అవాంతరాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని ఇప్పటికే విద్యుత్‌శాఖ అధికారులకు సూచించామని తెలిపారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని, ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండాలని సూచించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిఈ భానుప్రకాష్, ఏడిఈ జి.శ్రీనివాస్, ఏఈ పి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పవిత్రరంజాన్ మాసం ఆరంభం

-ప్రారంభమైన రంజాన్ ఉపవాస దీక్షలు


సంగారెడ్డిలో పండ్ల దుకాణాలు కనువిందు చేస్తున్న దృశ్యం

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 2, ప్రభాతవార్త:
ముస్లింసోదరులు ఎంతో పవిత్రముగా భావించే రంజాన్‌మాసం ఆదివారం నుండి ప్రారంభమైంది. ఇస్లాం కాలమానంప్రకారం రంజాన్ నెలవంక దర్శించిన తర్వాతరోజునుంచి ఈపవిత్రమాసం ప్రారంభమౌతుంది. ఈమాసంలో ముస్లింసోదరులు కఠోర ఉపవాసదీక్షలను పాటిస్తారు. ఎక్కువ సమయం దైవారాధనలో ఉంటారు. మానవాళికి ముక్తిమార్గాన్ని చూపించేందుకు దైవం పంపిన పవిత్రమైన "ఖురాన్" గ్రంథం అవతరించిన మాసమిది. అందుకే ఈమాసానికి అత్యంతప్రాధాన్యం ఉంది. శనివారంసాయంత్రం నెలవంక కనిపించడంతో ఆదివారం ఉదయంనుండి ఉపవాసదీక్షలు ప్రారంభమయ్యాయి. నెలరోజులపాటు రాత్రి ఇషాఅనమాజ్ తర్వాత ప్రత్యేకంగా తరాబి నమాజ్ చేస్తారు. రంజాన్‌మాసం ప్రారంభంకావడంతో సంగారెడ్డి పట్టణంలోని ప్రధానకూడళ్లలో పండ్లు, ఫలహారాలు, ఇతర తినుబండారాల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి.

## జాతీయసమైక్యత శిబిరానికి తారా అధ్యాపకుడు

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 2, ప్రభాతవార్త:
సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలకు చెందిన అర్థశాస్త్ర అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్‌అధికారి డాక్టర్ జగదీశ్వర్ ఒరిస్సాలో జరిగే ఎన్ఎస్ఎస్ జాతీయసమైక్యత శిబిరానికి తెలంగాణ రాష్ట్రము తరపున పాల్గొని ఆరుగురు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల బృందానికి కాంటినెంట్ లీడర్‌గా ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎస్ఎస్ రత్నప్రసాద్ తెలిపారు.

## ప్రభుత్వాల నిరంకుశ ధోరణిని ఎదిరించాలి

-ప్రొఫెసర్ చింతకింది కాశీం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

గజ్వేల్ టౌన్, మార్చి 2, ప్రభాతవార్త:
ప్రభుత్వాలు వస్తుంటాయి పోతుంటాయి కానీ మేధావులు ప్రజలను చైతన్యపరుస్తూ ప్రభుత్వాలను అవసరమైనప్పుడు ప్రశ్నించాలని ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం పేర్కొన్నారు. టిపిటిఎఫ్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో ఆదివారం గజ్వేల్‌లో నిర్వహించిన విద్యాసదస్సు, రిమ్మనగూడ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.రాజులు ఉద్యోగవిరమణసభలో పాల్గొని మేధావులపాత్ర అనే అంశంపై ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షోభకాలంలో ఎన్ని అణచివేతలు ఎదురైనా సమాజశ్రేయస్సుకు పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. భారతదేశం అన్నిమతాలు, కులాలతో సమైక్యతతో కలగలిసిన ప్రజల నివాసమని, భారతదేశ ఉపాధ్యాయులు, మేధావులు ప్రజల అభ్యున్నతికి కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయదర్శిని సంపాదకులు ప్రకాష్‌రావు, ఏపిటిఎఫ్ పూర్వ అధ్యక్షుడు నరసింహారెడ్డి, పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.రామచంద్రం, వై.అశోక్ కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.నరేందర్, జోన్‌పరిధిలోని అధ్యక్షులు నాగరాజు, పర్వతం నర్సయ్య, గోవర్ధన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శులు విద్యాసాగర్, రాజనర్సింహ, వెంకట్, నాయకులు ఎల్లయ్య, మల్లయ్య, శంకర్, పరమేశ్వర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ముస్లాపూర్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయసమ్మేళనం

అల్లాదుర్గం, మార్చి 2, ప్రభాతవార్త:
మండలపరిధిలోని ముస్లాపూర్‌లో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థులు ఆత్మీయసమ్మేళన కార్యక్రమాన్ని ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. పాఠశాలలో 2004-05 విద్యాసంవత్సరంలో 10వతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఒకచోట కలుసుకుని నాటిస్మృతులను నెమరేసుకున్నారు. నాటు విద్యాబుద్ధులు నేర్పించిన పూర్వ ఉపాధ్యాయులు విజయ్ కుమార్, రాజేష్‌కుమార్, విజయ్‌కుమార్‌స్వామి, రాంచందర్‌రావులను ఘనంగా సన్మానించి ఆశీస్సులు అందుకున్నారు. 2దశాబ్దాల తరువాత కలుసుకున్న విద్యార్థులు ఒకచోట చేరుకోవడంతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రమేష్, శివకుమార్, మొగులయ్య, అనిల్, వెంకటేశం, కృష్ణ, నర్సింలు, వినోద్,ముఖేష్, బీరప్ప, మల్లేశం, కిష్టయ్య, రమేష్, శివరాజ్, రాజు,యాదయ్య, వీరమణి, నరసమ్మ, సుజిత, సంగీత, నవనీత, శశికళ, నిర్మల, మహేశ్వరి, శ్రావణి భూలక్ష్మి పాల్గొన్నారు.

# కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలకు ప్రాధాన్యం

-రిజర్వేషన్ ప్రాతిపదికన నామినేటెడ్ పోస్టుల భర్తీ
-డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి


సిసి రోడ్లు పనులను ప్రారంభిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

వర్గల్, మార్చి 2, ప్రభాతవార్త:
కాంగ్రెస్‌పార్టీకి కష్టకాలంలో పనిచేసిన ప్రతి కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని, అలాగే రిజర్వేషన్ ప్రాతిపదికన నామినేటెడ్ పోస్టులభర్తీలో ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గౌరారం హరిజనవాడలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అలాగే అక్కడే ఉన్న పేద ఎస్సీమహిళ ఇంటి మంజూరికి ప్రతిపాదించనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి గజ్వేల్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయిస్తున్నట్లు స్పష్టంచేశారు. అంతేకాకుండా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాధాన్యతాక్రమంలో సంక్షేమపథకాలను అర్హులైనవారందరికీ వర్తింపజేస్తామని అన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీకి విధేయులై పనిచేయాలని, క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఆధారాలతో పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదుచేస్తామని హెచ్చరించారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా సిసిరోడ్లు, మురికికాల్వల నిర్మాణానికి సిఎం రేవంత్‌రెడ్డి రూ.5కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యకర్తల కష్టసుఖాలలో భాగమవుతుండగా, తాను నిరంతరం అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. కార్యకర్తలకు, ప్రజలకు ఏసమస్యవచ్చినా తనదృష్టికి తేవచ్చని, రాష్ట్రంలోనే ప్రాధాన్యత కలిగిన గజ్వేల్ నియోజకవర్గంపై అధిష్ఠానం ప్రత్యేకదృష్టి ఉందని వివరించారు.కార్యక్రమంలో మాజీఎంపిపిమోహన్, మండలపార్టీ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, నాయకులు గుండు నర్సింలుగౌడ్,భానుప్రసాద్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నర్సింలు, పాశం వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, యాదగిరిగౌడ్, కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మారెడ్డిగూడెంలో 7వేల కోళ్ల మృతి

-కోళ్లఫాంను పరిశీలించిన పశువైద్యాధికారులు


బొమ్మారెడ్డిగూడెం తండాలో మృతిచెందిన కోళ్ల దృశ్యం

చౌటకూరు, మార్చి 2, ప్రభాతవార్త:
సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలపరిధిలోని బొమ్మారెడ్డిగూడెం తండా సమీపంలోని ఓకోళ్లఫాంలో 7వేల కోళ్లు మృత్యువాతపడ్డాయి. తండాకుచెందిన జుదావత్ ప్రవీణ్ తన వ్యవసాయక్షేత్రంలో సుగుణ ఇంటిగ్రేటెడ్ ఆధ్వర్యంలో ఫౌల్ట్రీఫాంను నిర్వహిస్తున్నాడు. నెల రోజుల క్రితం 9600 కోడిపిల్లలను తీసుకువచ్చి ఫౌల్ట్రీఫాంలో సాదుతున్నాడు. మూడురోజులుగా కోళ్లఫాంలో కోళ్లు మృతిచెందుతుండటంతో ఫాం నిర్వాహకులు ప్రవీణ్ మండల పశువైద్యాధికారి విశాల్‌కు సమాచారం ఇవ్వగా ఆదివారం పశువైద్యాధికారి కోళ్లఫారంకు చేరుకుని మృతిచెందిన కోళ్లను పరిశీలించారు. వైరస్‌సోకి 7వేల కోళ్లు మృతిచెందాయని, బతికున్న మిగతాకోళ్లసైతం మరణిస్తాయని డాక్టర్ విశాల్ తెలిపారు. వైరస్‌తో మృతిచెందిన కోళ్లను వెంటనే మట్టిలో పూడ్చివేసి ఫౌల్ట్రీఫాంను శానిటేషన్ చేయాలని రైతు జదావత్ ప్రవీణ్‌కు సూచించారు. బర్డ్‌ఫ్లూతో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, మృతిచెందిన కోళ్ల కళేబరాన్ని పరీక్షలనిమిత్తం హైద్రాబాద్‌లోని లేబోరేటరీకి పంపిస్తామన్నారు. ఫిబ్రవరి 23న మండలంలోని తాడ్దాన్‌పల్లి శివారులోని కోళ్లఫాంలో 900కోళ్లు వైరస్ బారినపడి మృతిచెందిన విషయం పాఠకులకు విదితమే. బొమ్మారెడ్డిగూడెంలో 7వేల కోళ్లు మృతిచెందినట్లు తెలుసుకున్న ఉమ్మడిపుల్‌కల్ మండలప్రజలు బర్డ్‌ఫ్లూతోనే కోళ్లు మృతిచెందుతున్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నగేష్ శెట్కార్

నారాయణఖేడ్, మార్చి 2, ప్రభాతవార్త:
నారాయణఖేడ్‌కు చెందిన బక్షి రవీందర్ కుమార్తె వివాహవేడుకల్లో, మండలపరిధిలోని అబ్బెందగ్రామానికి చెందిన డాక్టర్ జగప్ప కుమారుల నూతనవస్త్రధారణ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్‌జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్‌కుమార్ శెట్కార్, టిపిసిసిసభ్యులు కె.శ్రీనివాస్‌లుపాల్గొని నూతన వధూవరులను, చిన్నారులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నాగల్‌గిద్ద మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావుపాటిల్, వినోద్‌పాటిల్, శంకరంపేటపట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భానుగౌడ్, శంకరంపేట్ మండల యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జహంగీర్, నాయకులు సతీష్ శెట్కార్, కొండల్, హావప్ప పాట్, రాజు, జగప్ప, నందు, పండరి, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే


చిన్నారులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మార్చి 2, ప్రభాతవార్త:
మనూర్ మండలపరిధిలోని కమలాపూర్‌గ్రామానికి చెందిన కొట్టం మారుతిరెడ్డి కుమారుడు, కుమార్తెల, మండలకేంద్రమైన రేగోడ్‌గ్రామానికి చెందిన గోపాన్‌పల్లి శంకరప్ప కుమారుడి నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేవెంట నాయకులు న్యాయవాది సంగన్న, నాయకులు అశోక్‌రావులున్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 2, ప్రభాతవార్త:
కంగ్టి మండలం బోర్గి, విఠల్‌వాడి గ్రామాల్లో ఆదివారం అంగరంగ వైభవంగా హనుమాన్ ఆలయాల్లో నిర్వహించిన విగ్రహాల ప్రతిష్ఠాపన పూజాకార్యక్రమాల్లో డిసిసి ప్రధానకార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డితో కాంగ్రెస్‌పార్టీ నాయకులు విఠల్‌రెడ్డి, బాబు పటేల్, మల్లారెడ్డి, ప్రహ్లద్ రావు, జగదీష్, బబి రాజు, బాబు తదితరులు ఉన్నారు.

## మైకోడ్‌లో భక్తిశ్రద్ధలతో హోమాలు


మైకోడ్‌లో యజ్ఞం చేస్తున్న దంపతుల దృశ్యం

మనూర్, మార్చి 2, ప్రభాతవార్త:
గ్రామం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ప్రతిమాసం మొదటి ఆదివారం వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామ దంపతులచే యజ్ఞహోమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మార్చి మాసంలో మొదటి ఆదివారం గ్రామంలో యజ్ఞం పూజాకార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజాకార్యక్రమాలకు చేరుకున్నభక్తులకు తీర్థప్రసాదాలు (అన్నదానం) అందచేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవాసమితి బాధ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## యువతి వివాహానికి ఆర్థికసహాయం

కోహెడ, మార్చి 2, ప్రభాతవార్త:
మండలపరిధిలోని విజంపల్లిగ్రామంలో నూతన వధువుకు ఆదివారం ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థికసహాయం అందజేశారు. యూనియన్‌సభ్యులకు యూనియన్ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. భవిష్యత్‌లో యూనియన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవాకార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ చైర్మన్ అన్నాడి జీవన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, యూనియన్ వైస్ చైర్మన్ కొంకటి మల్లేశం, మాజీ చైర్మన్ వెంకటస్వామి, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా కాంగ్రెస్‌పార్టీ

-మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్‌యాదవ్

చిన్నకోడూరు, మార్చి 2, ప్రభాతవార్త:
మండల కేంద్రానికి చెందిన నూతన వధువు వివాహనిమిత్తం మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం 50 కిలలో బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ సర్కారుకు ప్రతి ఒక్కరూ అండగా నిలువాలన్నారు. పేదలను ఆదుకోవడానికి భవిష్యతల్‌లో పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సందబోయిన పర్శరాం, మిట్టపల్లి కనకరాజు, ఉడుత జయంత్, గణేష్, ఉడుత ప్రశాంత్, సింగిరాల రాజు, గుండు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.